రైలు కుదుపులకి బెర్తు మీద పడుకున్న నాకు ఉయ్యాలలో ఊగుతున్నంత హాయిగా వుంది. నేనెప్పుడూ ఒకే వూళ్ళో వుండను. వృత్తి రీత్యా అన్ని వూళ్ళూ తిరుగుతూ వుంటాను. ప్రతి వూళ్ళోనూ లాడ్జిలో బస చెయ్యడం, ఒక వారం రోజులపాటు అక్కడ స్థానికులకు జ్యోతిష్యం చెప్పడం, తర్వాత ఆ వూరు వదలి ఇంకో వూరు వెళ్ళడం ఇది నా కార్యక్రమం.

# పందెం

ఎస్. సాయిప్రసాద్,
వేణుగోపాల్ కుమార్

ఈ వృత్తి వల్ల నేను పెద్దగా సంపాదించిందేమీ లేకపోయినా, రెండు పూటలా సాఫీగా గడిచిపోతోంది. చిన్నప్పుడు సరదాగా చెయ్యి చూడ్డం నేర్చుకున్నాను. అది అలా అలవాటుగా మారి ఈనాడు నాకింత తిండి పెడుతోంది.

ఆలోచనలు ఆపి పెట్లోంచి జ్యోతిష్యానికి సంబంధించిన పుస్తకం ఒకటి తీసి చదవనారంభించాను. ఒక పావుగంట చదివాక బోరుకొట్టి పుస్తకం మూసేసాను. ఏం చెయ్యాలో తోచక తోటి ప్రయాణికులను పరికించి చూస్తున్నాను.

అలా చూస్తున్న నా కళ్ళు ఒక వ్యక్తిని చూడగానే ఆగిపోయాయి. నా మొహం మీద ఎవరో చెళ్ళున చరచినట్టయింది. మళ్ళీ పరిశీలనగా అతడివైపు చూశాను. సందేహం లేదు... అతనే...

అతడు కానీ నన్ను చూసి గుర్తు పట్టాడంటే నేనిప్పుడు యాభై రూపాయిలు నష్టపోవాలి. అందుకే ఇటు పక్కకి మొహం తిప్పేసుకుని మళ్ళీ పుస్తకంలో తలదూర్చాను.

సాధారణంగా నేను చెప్పిన జాతకం అబద్ధమయిందా, నిజమయ్యిందా అన్నది నాకు తెలియదు. ఎందుకంటే నేను వారికి చెప్పింది అక్షరాలా జరిగిందో లేదో చూడ్డానికి నేనా వూళ్ళో ఎక్కువకాలం వుండను.

సాధారణంగా నేను చెప్పింది అక్షరాలా జరిగి తీరుతుందని నా నమ్మకం. కాని ఈ వ్యక్తిని చూస్తే ఆ నమ్మకం వమ్మవుతోంది.

ఎనిమిదేళ్ళ కిందట ఆ వ్యక్తితో జరిగిన సంభాషణ ఇప్పటికీ గుర్తుంది నాకు.

ఆ రోజు......

విశాఖపట్నంలో లాడ్జిలో వున్నాను నేను.

మధ్యాహ్నం రెండవుతుండగా వచ్చాడా వ్యక్తి.

"బయట జ్యోతిష్యం చెప్పబడును అన్న బోర్డు చూసి వచ్చాను." చెప్పాడు స్టూలు మీద కూర్చుంటూ.

"అలాగా, చెయ్యి శుభ్రంగా తుడుచుకుని ఇలా ఇవ్వండి."

ఒక్క నిమిషం అయ్యాక చెయ్యి చాపుతూ, "రెండేళ్ళలోగా నేను ఇల్లు కట్టగలనా?" అడిగాడు.

నేను అతని చేతిని పరిశీలనగా చూసి, కళ్ళు మూసుకుని ఏవేవో అంచనాలు వేసాను. కళ్ళు తెరిచే సరికి అతడు నేనేం చెప్తానా అని ఆసక్తిగా చూస్తున్నాడు.

"మీకు ఇల్లు కట్టే యోగం లేదండి. బహుశా రెండు నెలలలో మీకు ప్రమోషన్ రావచ్చు. కాని ఇల్లు మాత్రం కట్టలేరు." ఆగాను నేను.

అతడు నిరాశగా చూసాడు.

"మరొక విషయం. నిజానికి ఇది మీకు చెప్పకూడదు. కానీ చెప్తున్నాను. సంవత్సరం తిరిగే సరికల్లా బహుశా మీరు మరణిస్తారు."

అంతే. అతడి మొహం కోపంతో ఎర్రబడింది.

"చూడండి. మనిషి తనకున్న కోరికలు తీరుతాయా అని తెలుసుకోవడానికి జ్యోతిష్యుడి దగ్గరకొస్తాడు. అంతేకగాని తన చావు ఎంత దగ్గరలో వున్నది తెలుసుకోడానికి కాదు."

"నిజమే. మీరు రెండేళ్ళలో ఇల్లు కట్టలేరని ఎందుకన్నానంటే ఏడాదిలోగా మీరు మరణిస్తారు కదా, అందుకే ఇక మీ జీవితంలో 'రెండేళ్ళు' అనే ప్రసక్తే వుండదు."

"భవిష్యత్తు దివ్యంగా వుంది, అమోఘంగా వుంది. అని పొగడడానికే తప్ప, ఎన్ని రోజులలో చనిపోతారు అన్నది చెప్పడానికి జ్యోతిష్యం పనికిరాదు. ఒక వేళ అలా చెప్పినా కూడా అది అబద్ధమే. ఎందుకంటే మీ మరణమే మీరు నిర్ణయించుకోలేరు. ఇక ఎదుటివాళ్ళ మరణం గురించి మీరేం చెప్పగలరు? ఏదో తృప్తి కోసం మాత్రమే మీ దగ్గరకు వచ్చాను. అందుకే మీ జ్యోతిష్యాన్ని నమ్మలేకపోతున్నాను." అన్నాడు వ్యంగ్యంగా.

"నమ్మలేకపోతే అది మీ కర్మ. కాని నేను చెప్పినది అక్షరాలా జరిగితీరుతుంది. కావాలంటే పందెం పెట్టండి. సరిగ్గా ఏడాది దాటాక మీరు బ్రతికి వుంటే నా చిరునామాకి ఉత్తరం రాయండి. మీకు నేను యాభై రూపాయిలు పంపుతాను. ఒక వేళ ఏడాదిలోగా మీరు చనిపోతే మీరు నాకు యాభై రూపాయిలు ఎలా ఇస్తారు?" అడిగాను నేను.

"సరే" అని జేబులోంచి చెక్కుబుక్కు తీసి యాభై రూపాయిలకు నా పేరు మీద చెక్కురాసి "ఇదిగో యేడాది మీద ఆరు నెల్ల తర్వాత చెల్లింపు అయ్యే చెక్కు ఇప్పుడే రాసాను. దీనిని నా దగ్గరే వుంచుతాను. ఇంటికి వెళ్ళాక ఒక కవర్లో సీలు చేసి మా యింట్లో ఎవరికైనా ఇస్తాను. యేడాదిలోగా నేను చనిపోతే మీకు పంపమని చెప్తాను." అన్నాడు.

నేను తల వూపాను.

నా ఫీజు పది రూపాయిలిచ్చి వెళ్ళిపోతున్నప్పుడు చూసాను అతడి మెడ మీద కుంకుడు గింజంత పుట్టుమచ్చని, దాని మంచి వేలాడుతున్న పొడవాటి వెంట్రుకని.





ఆ తర్వాత దైనందిన జీవితంలో పడి అతడి సంగతే మరిచిపోయాను. ఇలా... ఎనిమిదేళ్ళ తర్వాత ట్రైన్‌లో కనపడ్డాడతను. అతడి మెడమీద కుంకుడు గింజంత పుట్టు మచ్చని, దానిమీద వెంట్రుకని చూసి పోల్చుకున్నాను. అతడు చనిపోలేదు. అంటే నేను పందెం ఓడిపోయాను. ఓడిపోయానన్న బాధకంటే, నా జ్యోతిష్యం తప్పయింది అన్న బాధే ఎక్కువయింది. నాకు అతడు నన్ను చూసి గుర్తుపడితే... గుర్తుపట్టలే దేమో...

ఎందుకు గుర్తు పట్టలేడూ... నేనతన్ని గుర్తు పట్టినప్పుడు అతను నన్ను గుర్తు పట్టలేడూ! పైగా ఎనిమిదేళ్ళ కిందట, ఇప్పుడూ నా వేషం కూడా ఒకటే. అదే విభూతి రేఖలు. అవే కర్ణకుండలాలు, అదే జరీ కండువా.

పోనీ ఇటు తిరిగి పడుకుంటే.

ఎలా... ఇంకా ఎనిమిది గంటలు ప్రయాణం వుంది. ఎంతసేపని అతడి దృష్టిలో పడకుండా వుండగలను. కనీసం బాత్రూంకి వెళ్ళాలన్నా అతడ్ని దాటుకునే వెళ్ళాలి.

ఎంతసేపని వుండగలను?

అయితే ఒకటే అర్థం కావడంలేదు. పందెం గెలిచినా అతడు ఉత్తరం ఎందుకు వ్రాయలేదు. మర్చిపోయాడా?

ఏమయినా నేనోడిపోయాను. కాబట్టే న్యాయంగా నేను యాభై రూపాయిలిచ్చేయాలి స్థిర నిర్ణయానికొచ్చి జేబులోంచి యాభై రూపాయినులు తీసి అతడి దగ్గరికెళ్ళాను.

"హలో" పలకరించాను.

ప్రశ్నార్థకంగా చూసాడు నావైపు'.

"మన పందెంలో మీరే గెలిచారు. ఇవిగో యాభై రూపాయిలు."

"ఏం షందెం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అదే ఎనిమిదేళ్ళ కిందటి పందెం. మీరు ఏడాదిలోగా చనిపోతారని నేను, చనిపోనని మీరు పందెం వేసుకున్నాం. మీరు చనిపోలేదు కాబట్టి మీరే గెలిచారు." అన్నాను నవ్వుతూ.

"అయితే అందరిలా మీరూ పొరపడ్డారన్న మాట. అతడు మా అన్నయ్య. మేం ఇద్దరం కవలలం. పుట్టు మచ్చలతో సహా ఒకేలా వుంటాం. అన్నయ్యకి జాతకాల పిచ్చి వుంది. బహుశా మా అన్నయ్యతో మీరు పందెం వేసి వుంటారు."

నాకాశ్చర్యం వేసింది. అంత పోలిక గల కవలలుంటారా అని.

"అయితే ఒకటి. మీరే పందెం గెలిచారు. ఏడేళ్ళ క్రిందట ఇల్లు కట్టుకొని గృహ ప్రవేశానికి కార్లో వెళుతూ ఏక్సిడెంటయి చనిపోయాడు అన్నయ్య. అంతకు కొన్ని నెలల ముందు నాకో కవరిచ్చి యేడాదిలోగా నేను చనిపోతే ఆ కవర్ని దాని మీదున్న చిరునామాకి పోస్ట్ చెయ్యమన్నాడు. కాని నేనా కవరుని పొరపాటున ఎక్కడో పడేశాను. అయితే అది మీకే ఇవ్వాలన్నమాట" అని జేబులోంచి యాభై రూపాయిలు తీసి "ఇవిగో పందెం డబ్బు. మా అన్నయ్య తరఫున నేనిస్తున్నాను." అన్నాడు.

నేను సున్నితంగా వారించి చెప్పాను.

"నేను కూడా ఒక విధంగా ఓడిపోయాను. ఎలాగంటారా? ఏడాదిలోగా ఇల్లు కట్టలేరని మీ అన్నయ్యకు చెప్పాను. కాని అతడు ఏడాదిలోగా ఇల్లు కట్టేడు కదా!"

ఓహ్. "ఇద్దరు వ్యక్తులూ గెలిచి ఓడిన విచిత్రమయిన పందెం" అన్నమాట అన్నాడతను బాధగా నవ్వుతూ.


రావినూతల సువర్ణాకన్నన్

నవల

గాలిగోపురం

త్వరలో ప్రారంభం